క్లుప్తంగా

నేటి నుంచి మారెమ్మ ఉత్సవాలు

రొళ్ల: మండలంలోని రొళ్లగొల్లహట్టితండాలో సోమ, మంగళవారం మారెమ్మ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 27న కలశస్థాపన, నవగ్రహపూజ, గణపతిపూజ కార్యక్రమాలు, 28న మారెమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠాపన, బలిహరణ, మహామంగళారతి, తీర్థప్రసాద వినియోగంతో పాటు భక్తులకు అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం


సిగ్బాతుల్లా (ఫైల్)

హిందూపురం: స్థానిక మేళాపురానికి చెందిన కర్పెంటర్ సిగ్బాతుల్లా (52) వారం రోజులుగా కనిపించడంలేదని ఆయన కుమారుడు నౌషాద్ ఆదివారం వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 19న ఉదయం బయటకు వెళ్లి వస్తానని చెప్పి మళ్లీ ఇంటికి రాలేదన్నారు. సెల్ కూడా స్విచ్ఛాఫ్ అని వస్తోందన్నారు. ఆరు అడుగుల ఎత్తు తెల్లషర్టు, తెల్ల ప్యాంటు ధరించి ఉంటారని, ఆచూకీ తెలిసిన వారు తెలియజేయాలని కోరారు.

ట్రాక్టర్ - ద్విచక్ర వాహనం ఢీ

రొద్దం: మండల పరిధిలోని గౌరాజుపల్లి గ్రామ సమీపంలో ఆదివారం ట్రాక్టర్ - ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు గౌరాజుపల్లి నుంచి రొద్దం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ట్రాక్టర్‌ని ఢీకొనడంతో రామ్మోహన్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. ద్విచక్ర వాహనం, ట్రాక్టర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు.

ఉపాధిలేని యువతపై సర్వే

హిందూపురం టౌన్: పట్టణంలోని బాలయేసు డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మండలంలోని కొటిపి పంచాయతీ ఇస్లాంపురంలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ అశ్వర్థనారాయణ పర్యవేక్షణలో అధికారిక విద్య లేదా సాధారణ ఉపాధిలేని యువతపై సర్వే నిర్వహించారు. సేకరించిన సమాచారాన్ని శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయ ఎన్‌ఎస్‌ఎస్ విభాగానికి సమర్పించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనాథ రెడ్డి తెలిపారు.

సాదర కులస్తులు అభివృద్ధి చెందాలి

రొళ్ల: నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో నివాసం ఉన్న హిందూ సాదర కులస్తులు విద్య, రాజకీయం, వ్యాపారం ఇతరాత్ర వాటిలో పూర్తిగా వెనుకబడ్డారని బెంగళూరు కేంద్రం హిందూ సాదర క్షేమాభివృద్ధి సంఘం డైరెక్టర్, తాలూకా అధ్యక్షుడు రంగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కాకి గ్రామంలో వెలసిన మల్లేశ్వరస్వామి ఆలయం ఆవరణంతో తాలూకా స్థాయి హిందూ సాదర క్షేమాభివృద్ధి సంఘం తరుపున ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. రంగారెడ్డి మాట్లాడుతూ సాదర కులస్తులు ఐకమత్యంతో సంఘాన్ని మరింత అభివృద్ధి చేసుకుని హక్కులను పొందాలన్నారు. అనంతరం తాలూకా స్థాయి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రంగారెడ్డి, కార్యదర్శిగా నరసింహమూర్తి, ట్రెజరర్‌గా డీఆర్ జ్యోతితో పాటు డైరెక్టర్లను ఎంపిక చేశారు.

ఉచిత వివాహాలకు పేర్లు నమోదు చేసుకోండి

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 31న ఉచిత సాముహిక వివాహాలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ రఘువీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివాహాలు చేసుకునే వారు 28 లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 9492623700 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు 'వైఎస్సార్ ఆసరా' సమావేశం

పెనుకొండ: పట్టణంలోని వన్షికా ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఉదయం 9 గంటలకు 'వైఎస్సార్ ఆసరా' సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాగలూరుబాబు, టౌన్ కన్వీనర్ బోయ నరసింహ తెలిపారు. మూడో విడతగా ఆసరా డబ్బులు జమ చేసిన నేపథ్యంలో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

భానుడి భగ భగ


మడకశిర: జనం లేక నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రోడ్డు


మడకశిర: జమ్మానిపల్లిలో చెట్లు కింద సేదతీరుతున్న వృద్ధులు

- దంచికొడుతున్న ఎండలతో అల్లాడిపోతున్న జనం
- జనం లేక వెలవెలబోతున్న ప్రధాన రహదారులు
- వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

హిందూపురం/పరిగి/పెనుకొండ రూరల్/మడకశిర రూరల్: ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 10 గంటల తర్వాత ఎండ తీవ్రత ఎక్కువవుతోంది. దీంతో కూలి పనులకు వెళ్లేవారు, పొలం పనులకు వెళ్లే వారు, ఉద్యోగస్తులు అవస్థలు పడుతున్నారు. ఎండవేడిమి రోజురోజుకూ అధికమవుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం దాకా ప్రధాన రహదారులు కూడా జనం లేక వెలవెలబోతున్నాయి. అవసరమైతేనే బయటకు వెళ్లాలని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.


పరిగి: జనం లేక వెలవెలబోతున్న వైఎస్సార్ సర్కిల్


హిందూపురం: జనం లేక నిర్మానుష్యంగా కనిపిస్తున్న సద్భావన సర్కిల్


హిందూపురం: చల్లటి పానీయాలు తాగుతున్న ప్రజలు


పెనుకొండ: తాటిముంజలు కొనుగోలు చేస్తున్న ప్రజలు


పెనుకొండ: రామమందిరం స్ట్రీట్ ఇలా...

అందరూ జాగ్రత్తలు తీసుకోవాలి



కొద్దిరోజులుగా ఎండలు మండిపోతున్నాయి. వడదెబ్బ బారిన పడకుండా అందరూ జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండ ప్రభావం ముఖ్యంగా చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధుల్లో ఎక్కువగా ఉంటుంది. చెమట పట్టడం, కళ్లు తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వడదెబ్బపై విస్తృత అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాం.

– స్వరూపారెడ్డి, వైద్యాధికారిణి, పరిగి

బయట తిరగలేకపోతున్నాం



ఎండ ఎక్కువ కావడంతో ఉదయం 11 తర్వాత బయట తిరిగే పరిస్థితి లేదు. ఏమైనా పనులుంటే ఉదయం 9 లోపు లేకపోతే సాయంత్రం 6 తర్వాత చేసుకుంటున్నాం. పెనుకొండ పర్యాటక ప్రాంతం కావడంతో ఇక్కడి వచ్చే వారు కూడా ఎండ వేడిమికి అవస్థలు పడుతున్నారు.

– ఆదినారాయణరెడ్డి, పెనుకొండ

ఎండలు తీవ్రమయ్యాయి



ఎండలు మండిపోతున్నాయి. మార్చి మాసంలోనే ఇలా ఉంటే మేలో ఎండలు ఎలా ఉంటాయో తల్చుకుంటేనే భయం వేస్తోంది. మిగిలిన ప్రాంతాలతో పోల్చితే హిందూపురం పరిసరాలే కొంత నయం అంటారు. ఇక్కడ కూడా ఎండ ఎక్కువగా ఉంది. మిగిలిన చోట్ల ఇంకేలా ఉంటుందో.

– భాగ్య, హిందూపురం

తెల్లవారుజామునే పనులు



ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత అధికమవుతుండటంతో బయటకు వెళ్లాలంటేనే ఇబ్బందిగా ఉంది. వయసు కూడా పైబడటంతో ఈ ఎండకు తాళలేక ఇంటి వద్దనే చెట్ల కింద ఉండిపోతున్నాను. సాయంత్రం లేకపోతే తెల్లవారుజామునే వెళ్లి పొలం పనులు చేస్తున్నాను. వచ్చే నెలను తల్చుకుంటేనే ఆందోళనగా ఉంది.

– వెంకటరెడ్డి, జమ్మానిపల్లి, మడకశిర

'తమ్ముళ్ల'లో అసంతృప్తి సెగ

- గోరంట్లలోకి ప్రవేశించిన యువగళం పాదయాత్ర


విద్యార్థితో టీడీపీ జెండా మోపిస్తున్న దృశ్యం

గోరంట్ల: తెలుగు దేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఆదివారం సాయంత్రం గౌనివారిపల్లి సమీపంలో గోరంట్ల మండలంలోకి ప్రవేశించింది. పాదయాత్ర గౌనివారిపల్లి మీదుగా కోరేవాండ్లపల్లి , రెడ్డి చెరువు కట్ట వరకు కొనసాగింది. పాదయాత్రకు తెలుగు తమ్ముళ్ల నుంచి స్పందన రాకపోవడంతో విద్యార్థులతో పార్టీ జెండాలను మోపించడం విమర్శలకు దారితీసింది.

ఎడమొహం పెడమొహంగానే నిమ్మల, పార్థసారథి

నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర గౌనివారిపల్లికి చేరుకోగా మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, మహిళా నాయకురాలు సవితమ్మతో పాటు పలువురు నాయకులు స్వాగతం పలికారు. మొదటిగా నిమ్మల కిష్టప్ప, సవితమ్మ... లోకేష్‌కు స్వాగతం పలకగా కొద్దిసేపటి తరువాత మాజీ ఎమ్మెల్యే పార్థసారథి వర్గీయులు స్వాగతం పలికారు. నిమ్మల, పార్థసారథి ఎడమొహం.. పెడమొహంగానే కార్యక్రమంలో పాల్గొనడంతో మరోసారి వర్గ విభేదాలు బయట పడ్డాయి. దీంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కూడా నిరుత్సాహానికి గురయ్యారు.

పాదయాత్ర బాయ్‌కాట్

నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర కోసం రూ.లక్ష ఖర్చు చేసిన ఇద్దరు యువకులు తమకు పాదయాత్రలో కనీస గౌరవం ఇవ్వలేదంటూ పాదయాత్రను బాయ్‌కాట్ చేశారు. పార్టీలో చురుగ్గ వ్యవహరించే ఓ సర్పంచ్ భార్త, మైనార్టీ వర్గానికి చెందిన ఓ యువ నాయకుడు కూడా తమకు సముచిత స్థానం ఇవ్వలేదంటూ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. మరికొందరు తెలుగు తమ్ముళ్లు సైతం పాదయాత్రను బాయ్‌కాట్ చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం.

ముున్సిపల్ కార్యాలయ నూతన భవనం ప్రారంభం

పావగడ: పట్టణంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి పట్టణాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దినట్లు ఎమ్మెల్యే వెంకటరమణప్ప అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన నూతన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణం నుంచి చళ్లకెర రోడ్డు, తుమకూరు రోడ్డు వరకు వీధి దీపాలు, తారు రోడ్లు వేయించామన్నారు. ప్రజల దాహార్తి తీర్చడానికి నాగలమడక నుంచి చాకలి కుంటకు పైపుల ద్వారా నీటి సరఫరాకు కృషి చేసినట్లు పేర్కొన్నారు. మున్సిపల్ అధ్యక్షురాలు ధనలక్ష్మి , మాజీ మున్సిపల్ చైర్మన్ జీఎస్ ధర్మపాల్ , గుర్రప్ప, మహ్మద్ ఫజులుల్లా , అన్వర్ భాష, ముఖ్యాధికారి షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

జాతీయ ఉపకార వేతానానికి ఎంపిక


గౌరిశంకర్


పవన్‌కుమార్


ఆర్.నివేదిత


కె.అనిత

సోమందేపల్లి: మండలంలోని చల్లాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి గౌరి శంకర్ ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీధర్ తెలిపారు.

పరిగి: మండలంలోని పైడేటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పవన్‌కుమార్ అనే విద్యార్థి . జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నీలకంఠేశ్వర తెలిపారు.

రొళ్ల: మండల పరిధిలోని ఎం.రాయాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఆర్.నివేదిత, కె.అనిత ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం స్నేహలత మార్గరేట్ తెలిపారు.

అసమ్మతి నేతలకు బుజ్జగింపులు

పావగడ: స్థానిక విధాన సభ క్షేత్రం కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్‌ను దక్కించుకున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప కుమారుడు హెచ్‌వీ వెంకటేశ్ అసమ్మతి నేతల మద్దతు కూడగట్టుకునేందుకు యత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే మాజీ ఎమ్మెల్యేలు సోమ్లానాయక్, ఉగ్ర నరసింహప్పతో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కోర్టు నరసప్పతో ఆయన భేటీ అయ్యారు. వచ్చే విధాన సభ ఎన్నికల్లో తనకు మద్దతివ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన జింక

పరిగి: మండలంలోని శాసనకోట పంచాయతీ పరిధిలో రోడ్డు ప్రమాదంలో జింక గాయపడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. చిలమత్తూరు మండలంలోని కొడికొండ నుంచి మడకశిర నియోజకవర్గాన్ని దాటుతూ కర్ణాటక శిర వరకూ నిర్మించిన జాతీయ రహదారి 544 ఈఈలో ఆదివారం మధ్యాహ్న సమయంలో రోడ్డుపైకి జింక వెళ్లింది. అదే సమయంలో రోడ్డుపై ప్రయాణిస్తున్న గుర్తు తెలియని వాహనం జింకను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జింకకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అటవీ శాఖ అధికారులను సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న అధికారులు చికిత్స నిమిత్తం జింకను తీసుకెళ్లారు.

బీజేపీ ప్రతిపక్షాల గొంతు నొక్కుతోంది


నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

హిందూపురం టౌన్: ఎన్నికల్లో ఓటమి భయంతో బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కి, అప్రజాస్వామ్య పద్ధతిలో గెలవాలని చూస్తోందని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. రాహుల్‌గాంధీపై తప్పులు కేసులు పెట్టారంటూ, లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటుపై స్థానిక గాంధీ సర్కిల్‌లో కాంగ్రెస్ నాయకులు బైఠాయించి కళ్లకు గంతలు కట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ , నాయకులు బాలాజీ మనోహర్, అమానుల్లా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల అడ్డగింత

పరిగి: మండలంలోని సేవామందిరంలోని ఓ పెట్రోలు బంకు వద్ద జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులకు ఆదివారం సదరు పెట్రోలు బంకు యజమాని అడ్డంకులు సృష్టించారు. దీన్ని ఖండించిన తమపై కూడా దౌర్జన్యానికి దిగినట్లు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. పరిగి మండలంలో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సేవామందిరంలోని ఓ పెట్రోలు బంకు యజమాని తన పెట్రోలు బంకు పరిధిలో డ్రైనేజ్ వేయడానికి వీల్లేదని సదరు కాంట్రాక్టర్‌తో పాటు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో వాగ్వాదానికి దిగారు. ఆర్అండ్‌బీ పరిధిలోకి వచ్చే స్థలంలో మాత్రమే పనులు చేస్తున్నారన్నా పట్టించుకోలేదు. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు.

అంకితభావంతో పనిచేయాలి

- ఐసీడీఎస్ కార్యాలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

గుడిబండ: ఐసీడీఎస్ సిబ్బంది అంకిత భావంతో పని చేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. గుడిబండ, అమరాపురం మండలంలోని 169 కేంద్రాలకు నూతనంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ మంజూరైంది. ఇందులో భాగంగానే గుడిబండలో నూతన ఐసీడీఎస్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే తిప్పేస్వామి, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలనా సౌలభ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రంలో కొత్తగా 54 ప్రాజెక్టులు మంజూరు చేస్తే అందులో జిల్లాకు 5 ప్రాజెక్టులు మంజూరయ్యాయన్నారు. గుడిబండకు కొత్తగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ మంజూరు చేశారన్నారు. త్వరలోనే సూపర్‌వైజర్ పోస్టులు కూడా భర్తీచేసి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ను మరింత బలోపేతం చేస్తానన్నారు. నూతన ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌కు సీడీపీఓగా పద్మావతిని ప్రభుత్వం నియమించారని తెలిపారు. కార్యక్రమంలో మడకశిర సీడీపీఓ నాగమల్లేశ్వరి, ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ భూతరాజు, సర్పంచ్‌లు యంజారేగౌడు, రంగస్వామి, లక్ష్మీనారాయణ, జేసీఎస్ మండల కన్వీనర్ కె.శివకుమార్, మండల బీసీ, ఎస్సీ సెల్ కన్వీనర్లు పాండు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సారథి జగనన్న


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి

హిందూపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమ పథకాల సారథి. 2024లోనూ మళ్లీ ఆయన్నే సీఎంగా చేసుకునేందుకు ప్రజలందరూ మద్దత్వివ్వాలని వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి అన్నారు. ఆదివారం హిందూపురం మండలంలోని కారుడిపల్లిలో 'మమేకం' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పర్యటిస్తూ సంక్షేమ పథకాలు అందిన తీరు, సమస్యలపై ఆరా తీశారు. మధుమతిరెడ్డి మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ ప్రజల క్షేమం కోసం రెండు అడుగులు వేస్తే.. ఆయన తనయుడు, సీఎం జగన్ నాలుగు అడుగులు ముందుకేసి విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధి, మౌళిక సదుపాయల కల్పనలో రాష్ట్రాన్ని అగ్రపథాన నిలిపేలా చర్యలు చేపట్టారన్నారు. టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రత్నమ్మ, వైస్ ఎంపీపీ రామాంజి, ఎంపీటీసీ కృషవేణి, సర్పంచ్ నంజప్ప, వైస్ సర్పంచ్ మహేందర్‌రెడ్డి, నాయకులు లోకేష్‌రెడ్డి, అనిల్, రవిమోహన్‌రెడ్డి, తిమ్మారెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

యోగి వేమన ఆశయసాధనకు కృషి


యోగి వేమన విగ్రహావిష్కరణకు హాజరైన నాయకులు

మడకశిర రూరల్: విశ్వకవి యోగివేమన ఆశయ సాధనకు ప్రతి ఒక్క రెడ్డి సామాజికవర్గ సభ్యుడూ కృషి చేయాలని రాష్ట్ర రెడ్డి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆదిరెడ్డి పాళ్యం సర్కిల్‌లో విశ్వకవి యోగివేమన విగ్రహావిష్కరణను ఘనంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరై మాట్లాడారు. రెడ్డి సంఘం కల్యాణ మండప నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రెడ్డి సంఘాన్ని బలోపేతం చేసి పేద విద్యార్థుల చదువుకు సహకారం అందించాలన్నారు. రాష్ట్ర, జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులు, సభ్యులు ధర్మారెడ్డి, బయపరెడ్డి, గోపాల్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, నాగభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక

పరిగి: హిందూపురంశాఖ హిందూ సాదర సంక్షేమాభివృద్ధి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎంపిక చేశారు. మండలంలోని కొడిగెనహళ్లి సాదర భవనంలో జరిగిన కార్యక్రమంలో నూతన అధ్యక్ష కార్యదర్శులతో పాటూ పాలక మండలి సభ్యులను ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా రామకృష్ణారెడ్డి, కార్యదర్శిగా రఘునాథ్‌రెడ్డి, కోశాధికారిగా చంద్రశేఖర్, గౌరవాధ్యక్షుడుగా చంద్రశేఖర్‌రెడ్డి, గౌరవ సలహాదారుగా అడ్వొకేట్ శ్రీనివాసరెడ్డిని ఎంపిక చేశారు.

'పట్టు' రైతులు, రీలర్ల బకాయిలు మంజూరు చేయాలి

- మంత్రి కాకాణిని కోరిన ఎమ్మెల్సీ ఇక్బాల్



హిందూపురం: హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌లో పట్టుగూళ్ల రైతులు, రీలర్లకు చెల్లించాల్సిన రాయితీ చెల్లింపులకు నిధులు మంజూరు చేయాలని మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ తెలిపారు. మండలి సమావేశాల్లో పట్టుగూళ్ల రైతులు, రీలర్లను ఆదుకోవాల్సిన అవసరం ఉందని ప్రసంగించినట్లు పేర్కొన్నారు. మంత్రి కాకాణి స్పందిస్తూ రైతులు, రీలర్లకు బకాయిగా ఉన్న సుమారు రూ.11 కోట్లను విడుదల చేస్తామని పేర్కొన్నారన్నారు. అలాగే ముస్లిం, మైనార్టీల సంక్షేమం కోసం చేపట్టాల్సిన చర్యలను శాసన మండలి సమావేశాల్లో ప్రస్తావించామన్నారు. ముస్లిం మైనార్టీలకు తెలంగాణ తరహాలో రెసిడెన్సియల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. అలాగే ఉర్దూ అకాడమీలోని కంప్యూటర్ సెంటర్లన్నీ పునరుద్ధరించి మరింత సమర్థవంతంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. వక్ఫ్ ఆస్తుల రక్షణ కేవలం వక్ఫ్ ఇన్‌స్పెక్టర్‌తోనే సాధ్యం కాదని ప్రతినెల జిల్లాస్థాయిలో ఆస్తులపై సమీక్షించాలని కోరామన్నారు. వక్ఫ్ చట్టాలు ఉల్లఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు.

కరాటే బెల్ట్ పరీక్షలు

హిందూపురం: కరాటే శిక్షణతో శారీర దృఢత్వంతో పాటు విద్యలో ఏకగ్రత పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని కరాటే మాస్టర్ రఫీక్ అహ్మద్ అన్నారు. ఆదివారం ఎల్ఆర్‌జీ స్కూల్‌లో హెచ్ఎం ప్రసాద్ పర్యవేక్షణలో విద్యార్థులకు బెల్ట్ పరీక్షలు జరిగాయి. ప్రతిభ కనపరచిన వారికి బెల్టులు ప్రదానం చేశారు. ఎల్ఆర్‌జి కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్‌రెడ్డి, ఏఓ సంజయ్, శిక్షకులు ప్రవీణ్‌కుమార్, లక్ష్మీనారాయణ శివరాజు, హరి తదితరులు పాల్గొన్నారు.